క్లుప్తంగా

లాటరీ ద్వారా సీట్ల భర్తీ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మైనార్టీ గురుకుల పాఠశాల ఖమ్మం బాలికల -1లో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం లాటరీ పద్ధతిన బుధవారం ఎంపికలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అబీదసల్మా తెలిపారు. పాఠశాలలో నాన్ మైనార్టీ విద్యార్థుల సీట్ల భర్తీ కోసం ఎంపికలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జనాబ్‌మహమూది పర్యవేక్షణలో విద్యార్థుల తల్లితండ్రుల సమక్షంలో ఈ ఎంపికలు నిర్వహించామన్నారు.

నేటి నుంచి 49 రోజుల పాటు జ్యోతి ప్రజ్వలన

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలో శ్రీఅఖిలాండకోటి అఖండజ్యోతి ప్రజ్వలన వ్రతం గురువారం నుంచి 49 రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహక కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ వేడుకలు రామసీతమ్మ హరిప్రసాదరావు కళా నిలయంలో రామ్‌జీ గురువు ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘర్షణ ఘటనలో నలుగురిపై కేసు

కూసుమంచి: కూసుమంచికి చెందిన యడ్ల లక్ష్మయ్య, ఆయన కుమారుడు సునీల్‌పై ఈనెల 19 రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన జమ్మి శ్రీకాంత్, కౌసల్య, రామస్వామి, వేల్పుల అఖిల్ తదితరులు దాడి చేశారు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని తమపై దాడి చేసినట్లు లక్ష్మయ్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన కొంకిమళ్ల విశ్వలక్ష్మి, కమతమ్ వెంకటరామయ్య, కంచికచెర్ల జయలక్ష్మి, కొప్పు సద్గురు మూర్తి, యర్రోజు భారతి, పులిపాటి నరసింహారావు, దారా వైకుంఠరావు మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్, అపోలో, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్. అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం

ఖమ్మంఅర్బన్:మమత ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి అనే నిరుపేదకు సత్యసాయి ధ్యాన మండలి ఖమ్మం శాఖ ఆధ్వర్యాన వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 8 వేలు ఆర్థిక సాయమందించారు.

జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: రేపు(శుక్రవారం) సాయంత్రం ఖమ్మం ఐఎంఏ హాల్‌లో నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలని నిర్వాహకులు ఇమామే ఖతిన్ మర్కజ్ జైనుల్ అబిదీన్ హఫీజ్ ఎండీ జవ్వాద్ కోరారు. బుధవారం ఖమ్మంలో సభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.దేశ వర్తమాన పరిస్థితులపై మన బాధ్యత అనే అంశంపై సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హఫీజ్ ఉస్మాన్, డాక్టర్ అబ్దుల్ రహీం, హఫీజ్ అబ్దుల్ హమీద్, అబ్దుల్ అలీం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	విరుపాక్ష
సాయిరాం	కిసీ కా బాయ్ కిసీ కీ జాన్
ఆదిత్య	బలగం
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	36		10
కాకర	36	చుక్కకూర	2
సోరకాయ	16		10
బీర	50	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	16	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	18		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	40		15
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

జాతరకు వేళాయె..!



మోటాపురంలోని వీరన్న స్వామి దేవాలయం

మోటాపురంలో రేపటి నుంచి వీరన్న స్వామి జాతర

- రెండేళ్లకోసారి జరిగే జాతరకు ఏర్పాట్లు పూర్తి
- మూడు రోజుల పాటు జరగనున్న సాంస్కృతిక పోటీలు
- ఈ ఏడు నుంచి మహిళలకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు
- రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చేలా కమిటీ ప్రతినిధుల కృషి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామంలో రెండేళ్లకోసారి నిర్వహించే వీరన్న స్వామి జాతరకు దేవాలయం కమిటి ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2013 సంవత్సరంలో నేలకొండపల్లి మండలం మోటాపురంలో తొలిసారిగా వీరన్నస్వామి జాతరను అత్యంత వైభవంగా ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు కోరిన కోర్కెలు తీర్చే వీరన్న స్వామిగా కొలుస్తుండడంతో నానాటికి భక్తుల సంఖ్య పెరిగిపోతోంది. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈ జాతరను జరిపించడంతో పాటు మూడు రోజులుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయన కమిటీ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. చివరి రోజున వీరన్న స్వామికి ప్రీతిపాత్రమైన పశువుల ప్రదర్శన(పశువుల పోటీ) జరగనుంది. ఈ ఏడు కొత్తగా మూడు రోజుల పాటు మహిళ కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు.

వీరన్న స్వామి జీవిత చరిత్ర..

శత్రువులను ఎదిరించేక్రమంలో వీర మరణం పొంది వీరుడిగా.. వీరన్నగా దైవత్వాని పొంది, కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా కొలవబడుచున్న వీరన్న స్వామి జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. 300 నుంచి 350 ఏళ్ల క్రితం రాజేశ్వరపురం కేంద్రంగా రావెళ్ల వంశస్థులు ఓ కోట(ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది) పరిపాలన సాగించేవారు. రావెళ్ల దొరకు ఇద్దరు కుమారులు కాగా వారిలో చిన్నవాడే వీరన్న. అనారోగ్యంతో రావెళ్ల దొర మరణించటంతో వీరన్న సోదరులు గుమస్తాలపై ఆధారపడి పరిపాలించేవారు. కానీ, గుమస్తాలు కోటను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో గోల్కొండ నవాబుకు కట్టే కప్పం తమ పేరు మీద వ్రాయించుకోవడంతో పాటు వీరన్న పెళ్లి రోజున కోట ఆక్రమణకు ప్రయత్నించగా వీరన్న సోదరుడు శత్రువులను తరిమివేశారు. లొంగినట్లుగా నటించి వీరన్న సోదరుడిని విషాహరం పెట్టి చంపేశారు. అంతేకాకుండా కోటలోని పశు, సంపదను దోచుకెళ్లడంతో వీరన్న ఉగ్రుడై వెంబడించి వారిని నిలువరించాడు. ఈ క్రమంలో శత్రు సైనికులు వీరన్న ఆయన అనుచరులను దొంగ దెబ్బతీసి చంపేస్తారు. అప్పటి నుంచి భక్తులకు కలలో కనిపించటంతో పాటు వారు కోరుకున్న కలలు నెరవేరటంతో మహిమ గల వీరన్నస్వామిగా పూజలు అందుకుంటున్నారు.

రెండేళ్లకోసారి జాతర..



రెండేళ్లకోసారి వచ్చే జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్నాం. జాతరకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేలా జాతరను నిర్వహించేందుకు కమిటి ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. భక్తులు జాతరను తిలకించి.. వీరన్న స్వామి ఆశీస్సులు పొందితే శుభం కలుగుతుందనే నమ్మకం ఉంది.

- రావెళ్ల కృష్ణారావు, మోటాపురం

మహిమ గల స్వామి..



కోరిన కోర్కెలు తీర్చే మహిమ గల వీరన్న స్వామిని దర్శించుకునేందుకు ప్రతీ ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. మొక్కులు తీర్చుకుని, పండగలా జాతర చేసుకుంటున్నారు. వీరన్న స్వామి చరిత్రను నేటి తరానికి తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- వీరన్న, నున్నా రవికుమార్, మోటాపురం

ఆలయ అభివృద్ధికి సహకరించాలి..



వీరన్న స్వామి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటి కృషి చేస్తోంది. మరింత అభివృద్ధి చేసేందుకు దాతల సాయం కూడా చాలా అవసరం. మూడు రోజులు జరిగే జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

- చావా కోటయ్య, దేవాలయ చైర్మన్, మోటాపురం

రిజర్వేషన్లు రద్దు చేసే అధికారం లేదు..

ఖమ్మంమయూరిసెంటర్: అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేసే అధికారం బీజేపీకి లేదని బీఆర్‌ఎస్ ముస్లిం, మైనార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఖమ్మంలో బీఆర్‌ఎస్ ముస్లిం, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫాతిమా జోహరా, షేక్ మక్బూల్, మహ్మద్ అశ్రిఫ్, జహీర్ అలీ, ఎండీ.ఖమర్, షౌఖత్ అలీ, ఇషాక్, ఖాసిం మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడం గర్హనీయమని, ఇకనైనా ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న ముస్లిం, మైనార్టీ నేతలు

కాగా, బీజేపీ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈసమావేశంలో ముక్తార్, షకీనా, షంషుద్దీన్, మజీద్, అబ్దుల్ మజీద్, సలీం అహ్మద్, ఇలియాజ్, జానీమియా, సయ్యద్ అఫ్సర్, జానీ, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

తిరుమలాయపాలెం: అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్ల వానలకు మండలంలో జరిగిన పంట నష్టాలను బుధవారం సీపీఓ శ్రీనివాస్, ఖమ్మం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎ.శ్రీనివాస్‌లతో కూడిన బృందం పరిశీలించింది. మండలంలోని తాళ్లచెర్వు, తెట్టెలపాడు, పాతర్లపాడు క్లస్టర్ల పరిధిలో మొక్కజొన్న, వరి పంటలకు జరిగిన నష్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మొక్కజొన్న తోటలు దెబ్బతిన్నాయని, వరి పంటకు నష్టం ఏమి జరగలేదని స్పష్టం చేశారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ఎన్.సీతారాంరెడ్డి, ఏఈఓలు రచన, ఆసియా, నవనీత, రైతులు తదితరులు ఉన్నారు.

'అమ్మ'కు సన్మానం

తిరుమలాయపాలెం: మండలంలోని మహ్మదాపురం గ్రామపంచాయతీ పరిధిలోని బోడతండాకు చెందిన బోడ రవి, మంజు కుమారుడు బోడ సోమేశ్వర్ అనే విద్యార్థి దమ్మపేట గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈఏడు క్లాస్ ఫస్ట్ రావడంతో కళాశాల ప్రిన్సిపాల్ జానునాయక్ ఆ విద్యార్థికి శాలువా కప్పి మెమెంటో బహూకరించారు. ఈ సమయంలో తల్లిదండ్రులు లేకపోవడాన్ని లోటుగా భావించి సోమేశ్వర్ తన ఇంటికి వచ్చి తల్లిని శాలువా కప్పి సన్మానించాడు. తన తల్లికి చదువురాకపోయినప్పటికీ తనను చదువులో ప్రోత్సహించేదని, అందుకే తను ఇష్టంగా కష్టపడుతున్నట్లు సోమేశ్వర్ తెలిపాడు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 24, 25 తేదీల్లో సూర్యాపేటలో జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో రెండోసారి ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఖమ్మం జిల్లా నుంచి ఎం.రాజేంద్రప్రసాద్, బజ్జూరి వెంకటరామిరెడ్డి, వై.ప్రకాష్, ఎస్‌కె.ఖాసిం ఎన్నికైనట్లు సంఘ బాధ్యులు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యమాలు, పోరాటాలలో ముందుండి బాధ్యతతో కొనసాగిస్తామని ఎంపికైన నాయకులు పేర్కొన్నారు.

కార్మికుల సమ్మెకు ఐఎఫ్‌టీయూ మద్దతు

ఖమ్మంమయూరిసెంటర్: తమ డిమాండ్ల పరిష్కారం కోసం విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్లు చేపట్టిన సమ్మెకు ఐఎఫ్‌టీయూ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులు వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేస్తామంటే ఎస్మా ప్రయోగిస్తామనడం దారుణమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానాలు చెప్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమ్మెకు కార్మిక సంఘాలన్నీ మద్దతు తెలపాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం టౌన్–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు దృష్ట్యా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మౌల్విక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ దానవాయిగూడెం ఉపకేంద్రం పరిధిలోని సారధినగర్, 33/11 కేవీ గాంధీచౌక్ ఉపకేంద్రం పరిధిలోని మోతీనగర్11కేవీపరిధిలోని దానవాయిగూడెం, జైలురోడ్, సారధినగర్, వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, జూబ్లీక్లబ్ రోడ్, పీఎస్‌ఆర్ రోడ్, హనుమాన్ టెంపుల్ రోడ్, పంపింగ్‌వెల్ మెయిన్ రోడ్, రంగనాయకుల గుట్ట, మోహన్ రోడ్, మోతీనగర్, వాసవీ ఫంక్షన్ హాల్ రోడ్, గోల్డ్ కాంప్లెక్స్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, మూడు బొమ్మల సెంటర్ ఏరియా, గాంధీనగర్, గ్రంథాలయం లైన్, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, బోసుబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపటి సమ్మెకు సహకరించండి

నేలకొండపల్లి: రేపటి(శుక్రవారం) నుంచి చేపట్టనున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సహకరించాలని సంఘం జిల్లా నాయకుడు బైరం దినేష్‌కుమార్ కోరారు. ఈమేరకు బుధవారం మండలంలోని ఎంపీడీఓ, ఎస్సై, జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీలకు వినతి పత్రాలను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ చేయాలని, అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని సమ్మెకు ప్రతీ ఒక్కరూ సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్, లింగరాజు, వీరబాబు, మహేష్, శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

నేలకొండపల్లి: మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పని గంటలను తగ్గించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అన్ స్కిల్డ్ వారికి రూ. 18,000 ఉండే విధంగా రూపొందించిన జీఓ 25ను ఎందుకు గెజిట్ ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిరాలాల్, కమలమ్మ, సుజాత, శ్రీలత, రంగమ్మ, ఆనంద్, యశోద, వెంకటలక్ష్మి, వీరకుమారి, సైదావాలి, కౌసల్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి సుడిగాలి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం నగరంతో పాటు రూరల్‌లో విస్తృతంగా పర్యటించారు. నగరంలోని బుర్హాన్‌పురంలో గడ్డం దామోదర్‌రెడ్డి భార్య సుజాత, శ్రీనివాసనగర్‌లో జెల్లా దుర్గమ్మ చనిపోగా వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఎస్ఆర్ గార్డెన్‌లో హిజ్రాల సంఘం నాయకురాలు దోమలమేరీ ఆధ్వర్యంలో జరిగిన మురిగి మాతా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనగా.. నిర్వాహకులు పొంగులేటికి ఘనస్వాగతం పలికారు. అదేవిధంగా ఖమ్మంరూరల్ మండలం ముత్తగూడెంలో ఓ వివాహ వేడుకకు, సత్యనారాయణపురంలో గృహప్రవేశ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. పొంగులేటి వెంట మద్దినేని బేబి స్వర్ణకుమారి, డాక్టర్ కోటా రాంబాబు, నారపోగు వెంకట్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మైనారిటీ జిల్లా నాయకులు ఇమామ్ భాయ్, దుంపల రవికుమార్, బోడా శ్రావణ్ కుమార్, అజ్మీరా అశోక్ నాయక్, మద్ది కిశోర్ రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సూతగాని ఉపేందర్, గునిగంటి రమేష్, మెండెం కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలుకుతున్న హిజ్రాల సంఘం బాధ్యులు

పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు లైట్లను ఏర్పాటు చేయాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. బుధవారం నగరంలో పర్యటించినసందర్భంగాఆయన మాట్లాడారు. ఈనేపథ్యంలో 25, 26వ డివిజన్లలోని పబ్లిక్ టాయిలెట్లు రోడ్డుపై వెళ్లే వారికి కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అదేవిధంగా 23వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న పార్క్‌ను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలన్నారు. అంతేకాక 22వ డివిజన్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి, సౌకర్యాలపై ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, తప్పనిసరిగా గ్లౌజ్‌లు, బూట్లు వినియోగించాలని, యూనిఫామ్ ధరించాలన్నారు. ఎస్సై, జవాన్‌లు ఏ రోజు కారోజు పనుల వివరాలను రిజిస్టర్‌లోతప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి, డీఈ నవ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

ఎమ్మెల్సీ పల్లాను కలిసిన పాలేరు నేతలు

ఖమ్మం రూరల్/ కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సూచనతో పాలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు బుధవారం ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పల్లా పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, కమిషనర్ అనిల్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. మిల్లర్లు నాలుగు కిలోల తరుగు తీస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరగా.. తడిసిన ప్రతీ ధాన్యపు గింజను మిల్లర్లచే కొనుగోలు చేయిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు ఇంటూరి శేఖర్, నాగుబండి శ్రీనివాసరావు, చావా వేణు, ఎంపీపీలు శ్రీనివాస్, మంగీలాల్, రూరల్ జెడ్పీటీసీ వరప్రసాద్, పార్టీ నాయకులు వీరయ్య, ఆసిఫ్ పాషా, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీతో నాయకులు, ప్రజాప్రతినిధులు

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: మెడిసిన్ చదువుతున్న ఇద్దరు నిరుపేద విద్యార్థినులకు డిస్ట్రిక్ట్ ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఫీజుకు సంబంధించి రూ.1.50లక్షల చెక్కును కలెక్టర్ వీపీ గౌతమ్ అందించారు. బుధవారం ఐడీఓసీలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. కరీంనగర్ చలిమేడా ఆనందరావు మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.సౌజన్యకు ఫిలిడేల్ఫియా తెలుగు అసోసియేషన్, ఎన్నారై ఫౌండేషన్ సంయుక్తంగా రూ.లక్షను ఖమ్మంలోని అంబేద్కర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ద్వారా, నార్కెట్‌పల్లి కిమ్స్‌లో చదువుచున్న శ్రీవిద్యకు ఎన్నారై ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలను ఆమె తల్లికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఫౌండేషన్ అధ్యక్షులు బోనాల రామకృష్ణ, పసుమర్తి రంగారావు, బండి నాగేశ్వర రావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవీ.పాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మందటి సంధ్యారాణి కోరిక మేరకు బుధవారం పంచాయతీ కార్యాలయంలో 40 మంది దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కూసుమంచి ఉన్నత పాఠశాలకు అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న హెచ్‌ఎం విక్రంరెడ్డి

కూసుమంచి: కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్వచ్ఛ విద్యాలయ అవార్డు లభించింది. ఈమేరకు బుధవారం కలక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డీఈఓ సోమశేఖర శర్మ, సీఎంఓ రాజశేఖర్ పాఠశాల హెచ్‌ఎం రేల విక్రంరెడ్డికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, తాగునీరు తదితర అంశాల్లో ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మైమూనా అభినందనలు తెలిపారు.

'ప్రియదర్శిని'లో అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్: మండలంలోని పెద్దతండా ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎక్రాయిన్ సంస్థ, హైదరాబాద్ వారిచే కెరీర్ పురోగతి, ఉపాధి నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు సుమంతి, సోనీ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్, టీమ్ వర్క్, లీడర్‌షిప్, కంప్యూటర్ లిటరసీ, క్రిటికల్ థింకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ గోపాల్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్'కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: 2022–23వ విద్యా సంవత్సరానికి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన స్వచ్ఛతలో భాగంగా తమ పాఠశాల స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఎంపికైనట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఐడీఓసీలో పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో గత ఐదు రోజులుగా ఎంబీఏ విద్యార్థులకు గోల్‌స్ట్రీట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ బుధవారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. ఈ శిక్షణ వెబ్‌సైట్ ఫర్ బిజినెస్ డిజిన్, యాడ్ పోస్టింగ్, వివిధ రకాల డిజిటల్ మార్కెటింగ్ ప్లాట్‌ఫాంల నిర్వహణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

రఘునాథపాలెం/నేలకొండపల్లి/కూసుమంచి/తిరుమలాయపాలెం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్)ఆధ్వర్యాన రఘునాథపాలెం, తిరుమలాయపాలెం ఎంపీఓలు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, నేలకొండపల్లి, కూసుమంచి ఎంపీడీఓలు జమలారెడ్డి, కరుణాకర్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి, సంఘం పాలేరు డివిజన్ నాయకులు చిర్రా భిక్షం, సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య, సంఘం డివిజన్ అధ్యక్షుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అర్హులైన కూలీలందరికీ రోజుకు రూ.600 చెల్లించాలని, కనీసం 200 రోజులు పనిదినాలు పని కల్పించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, కొలతలు లేకుండా వేతనాలు వారం వారం అందించడంతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస బీమా రూ.10లక్షలు ప్రకటించాలని, తక్షణ వైద్యం ఖర్చులు ప్రభుత్వం భరించాలని కోరారు. అడిగిన ప్రతీ ఒక్కరికి పని ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రఘునాథపాలెం కార్యక్రమంలో మండల నాయకులు కేతోత్ లక్ష్మణ్, పాపారావు, నరసయ్య, సూర్యనారాయణ, వెంకట్రామయ్య, తదితరులు పాల్గొనగా.. నేలకొండపల్లిలో పగిడికత్తు రామదాసు, దామాల రామదాసు, షకీలా, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్, తిరపయ్య, రేణుక, రామకృష్ణ, కూసుమంచిలో నాయకులు వెంకటప్పారావు, నాగేశ్వరరావు, గిరి, రాధాకృష్ణ, తిరుమలాయపాలెంలో మండల కార్యదర్శి రాయిండ్ల చిరంజీవి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం: ఎంపీఓకు వినతి అందజేస్తున్న సంఘం నాయకులు